సాక్షి
నిర్మల్
శుక్రవారం : 27 : జనవరి : 2023



నాగోబాకు పోటెత్తిన భక్తజనం

నాగోబా జాతరకు గురువారం భక్తులు పోటెత్తారు. సెలవు రోజు కావడంతో ఉమ్మడి జిల్లాతో పాటు తెలంగాణ, మహారాష్ట్రల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. 8లో▸



గిరిజనాభివృద్ధే ధ్యేయం..

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఐటీడీఏ ద్వారా కృషి చేస్తున్నామని పీవో వరుణ్‌రెడ్డి అన్నారు. ఉట్నూర్ లోని ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో మాట్లాడారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
32.1 / 16.3

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు ఒకటి రెండు డిగ్రీలు తగ్గుతాయి. వేకువజామున మంచు కురుస్తుంది. చలి స్వల్పంగా పెరుగుతుంది.



సరస్వతీ నమస్తుభ్యాం

- బాసరలో ఘనంగా వసంత పంచమి వేడుకలు
- అమ్మవారి జన్మదినం సందర్భంగా భారీగా తరలివచ్చిన భక్తులు
- తెల్లవారుజామునుంచే గోదావరిలో పుణ్యస్నానాలు..
- అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో బారులు..
- దర్శనానికి నాలుగు గంటలు.. అక్షరాభ్యాసానికి ఏడు గంటల సమయం
- క్యూలైన్లలో నిరీక్షించలేక ఇబ్బంది పడ్డ చిన్నారులు, వృద్ధులు

భైంసా/ముధోల్: చదువుల తల్లి సరస్వతీ క్షేత్రం బాసరలో వసంత పంచమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఏటా మాఘ శుద్ధ పంచమి రోజు అమ్మవారి జన్మదినం నిర్వహిస్తున్న సందర్భంగా అమ్మవారి దర్శనం కోసం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. బుధవారం రాత్రే సుమారు 50 వేల మంది భక్తులు బాసరకు చేరుకున్నారు. దీంతో ఆలయ అధికారులు గురువారం తెల్లవారుజామున 2 గంటల నుంచే అమ్మవారికి పూజలు ప్రారంభించారు. అర్చకులు అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు బాసర ఆలయ గర్భగుడిని పూలతో అలంకరించారు. ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రధాన ద్వారం వద్ద స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. దీంతో భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు చేసి అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరారు. ఆలయ ప్రవేశం వద్ద భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అతిథి గృహాల ముందు బారికేడ్లు ఏర్పాటు చేసి భక్తులను లోనికి అనుమతించారు. అమ్మవారి పూజల అనంతరం దర్శనానికి అనుమతించడంతో భక్తులు దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే గడ్డిగారి విఠల్‌రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకువచ్చారు. ఆలయ ఈవో విజయరామారావు, ఆలయ అధికారులు భాజాభజంత్రీలతో వారికి స్వాగతం పలికారు. అనంతరం పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న మంత్రి, ఎమ్మెల్యేలు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు.

ఆలయ అభివృద్ధికి కృషి...

అమ్మవారి దర్శనం అనంతరం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి క్యూలైన్లలో నిల్చున్న భక్తులతో మాట్లాడారు, పాలు, అరటిపండ్లు అందించారు. తర్వాత మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషిచేస్తామని తెలిపారు. వచ్చే వసంత పంచమి నాటికి మరిన్ని వసతి గృహాలు నిర్మిస్తామని తెలిపారు. ఆలయ అభివృద్ధి పనులు ఇప్పటికే ప్రారంభించామని పేర్కొన్నారు.

గంటల తరబడి నిరీక్షణ...

బాసరలో దివ్య ముహూర్తాన అక్షరాభ్యాసం చేయించాలన్న కోరికతో వచ్చిన భక్తులకు క్యూలైన్లలో ఇబ్బందులు ఎదురయ్యాయి. చిన్నారులను అక్షరశ్రీకార పూజలు జరిపించేందుకు నానమ్మలు, అమ్మమ్మలు, తాతయ్యలు బాసరకు వచ్చారు. చిన్నారుల అక్షరాభ్యాస పూజలు చూసేందుకు వచ్చిన వృద్ధులంతా ఎనిమిది గంటలపాటు నిరీక్షించారు. భక్తులు క్యూలైన్లలో ఒకరినొకరు తోసుకోవడంతో చిన్నారులు ఒత్తిడి తట్టుకోలేక ఏడ్చారు. అక్షరాభ్యాస మండపాల్లోనూ గంటల తరబడి నిరీక్షించాల్సి రావడంతో చాలామంది పిల్లలు ఏడుస్తూ కనిపించారు. మంచిర్యాల జిల్లా వేంపల్లికి చెందిన చిన్నారి క్యూలైన్లలో కిందపడడంతో తలకు గాయమైంది. వెంటనే అంబులెన్స్‌లో బాసర సీహెచ్‌సీకి తరలించి వైద్యసేవలందించారు. అమ్మవారి దర్శనానికి నాలుగు గంటల సమయం పట్టింది. క్యూలైన్లలో ఉన్నవారు వెనక్కి వెళ్లలేక, ముందుకు కదలలేక ఉన్నచోటే నిలబడి నీరసించిపోయారు. ఇక అత్యవసరాలకు కూడా వెళ్లలేని పరిస్థితి ఎదురైంది.

పలువురి సేవలు...

బాసర ఆలయంలో వసంత పంచమి సందర్భంగా వేంకటేశ్వర సేవాసమితి సభ్యులు, బాసర యువకులు, ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు, అఖిల భారత పద్మశాలి సంఘ సభ్యులు, సరస్వతి అమ్మవారి భక్తులు, యువకులు స్వచ్ఛందంగా సేవలు అందించారు. పోలీసులు ప్రధాన ద్వారాల వద్ద బందోబస్తును ఏర్పాటు చేశారు. బాసర రైల్వేస్టేషన్, బస్టాండ్, స్నానఘట్టాల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వచ్చిన వాహనాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాలకు మళ్లించారు.

అన్నదానం...

వసంత పంచమి సందర్భంగా పద్మశాలి సత్రంలో మహా అన్నదానం చేశారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారి ఆలయానికి వెళ్లేవారంతా మార్గమధ్యంలో పద్మశాలి సత్రానికి వెళ్లి అన్నప్రసాదం స్వీకరించారు. బాసర ఆలయం తరఫున నిత్యాఅన్నదాన సత్రంలోనూ అన్నదానం చేశారు. టీటీడీ భవనం ఎదుట వేంకటేశ్వర సేవాసమితి సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు.

రికార్డుస్థాయిలో అక్షరాభ్యాసాలు..

బాసర చరిత్రలో ఈ వసంత పంచమి రోజు రికార్డు స్థాయిలో అక్షరాభ్యాస పూజలు చేసినట్లు ఈవో విజయరామారావు తెలిపారు. కోవిడ్ కారణంగా రెండేళ్లుగా పిల్లలకు అక్షరాభ్యాస పూజలు వాయిదా వేసుకున్నవారు కూడా ఈ వసంత పంచమికి బాసరకు వచ్చారని తెలిపారు. దీంతో గురువారం ఒక్కరోజే 6,872 అక్షరాభ్యాస పూజలు జరిపించామని పేర్కొన్నారు. ఇందులో రూ.1000 అక్షరాభ్యాస పూజలు 4,046, రూ.150 అక్షరాభ్యాస పూజలు 2,826 జరిపించామని వివరించారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

వసంత పంచమి పురస్కరించుకుని బాసర సరస్వతి అమ్మవారిని దర్శించుకునేందుకు పలువురు ప్రముఖులు బాసరకు చేరుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఎమ్మెల్సీ దండె విఠల్, రాజ్యసభ సభ్యుడు దామోదర్‌రావు, ఈటల రాజేందర్ సతీమణి జమున, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బీజేపీ నాయకులు రామారావ్‌పటేల్ అమ్మవారిని దర్శించుకున్నారు. పూజలు చేశారు.



ప్రత్యేక అలంకరణలో సరస్వతీ అమ్మవారు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఐకేరెడ్డి దంపతులు



భక్తులతో పోటెత్తిన బాసర..

అమ్మవారి పుట్టిన రోజు అయిన వసంత పంచమి రోజు అమ్మవారిని దర్శించుకోవడంతోపాటు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించాలని రాష్ట్రంతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు బాసరకు తరలివచ్చారు. దీంతో బాసర క్షేత్రం బుధవారం రాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకు కిటకిటలాడింది. వేలాదిగా వచ్చిన భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో నిరీక్షించి అమ్మవారిని దర్శించుకున్నారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నుంచి 8 భజన మండళ్ల సభ్యులు పాదయాత్రగా బాసర వచ్చారు. అమ్మవారిని స్మరిస్తూ భజనలు చేస్తూ ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. చుట్టుపక్కల పల్లెల నుంచి వేలాది మంది భక్తులు పాదయాత్రగా వచ్చి బాసర అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు మంత్రి, ఎమ్మెల్యే రావడంతో అధికారులు సుమారు గంటపాటు దర్శనాలు నిలిపివేశారు. దీంతో భక్తులు ఇబ్బంది పడ్డారు.



చిరు వ్యాపారులకు గిరాకీ...

కరోనా కారణంగా రెండేళ్ల వసంత పంచమికి భక్తులు తక్కువగా వచ్చారు. ఈసారి కోవిడ్ నిబంధనలు, ఆంక్షలు లేకపోవడంతో భక్తులు పోటెత్తారు. బుధ, గురువారాల్లో సుమారు లక్ష మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. భక్తులు అధికంగా రావడంతో చిరువ్యాపారులకు గిరాకీ పెరిగింది. గోదావరి నది వద్ద గుర్రం సవారీ చేసేందుకు ఆసక్తి చూపారు. పెద్దలకు రూ.వంద, పిల్లలకు రూ.50 చొప్పున తీసుకుని గుర్రంపై కూర్చోబెట్టి తిప్పుకొచ్చారు. పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు గోదావరిలో బోటింగ్ చేశారు. చిరుతిళ్ల అమ్మేవారికి గిరాకీ కనిపించింది.

న్యూస్‌రీల్

పారదర్శకంగా ఉపాధ్యాయ బదిలీలు

నిర్మల్ రూరల్: జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తామని డీఈవో రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు సంబంధించిన ఉత్తర్వులు, షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసిందని పేర్కొన్నారు. జిల్లా ఆవిర్భవించిన తర్వాత 2018లో బదిలీలు జరిగాయని, ఇప్పుడు మొదటిసారిగా పదోన్నతుల ప్రక్రియ జరుగుతుందని వెల్లడించారు. పదోన్నతులతోపాటు బదిలీలు కూడా నిర్వహిస్తామని తెలిపారు. ఇందుకు డీఈవో కార్యాలయంలో సిబ్బందితో వివిధ కమిటీలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకారం బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఈనెల 27న ప్రారంభమై మార్చి 4వ తేదీ వరకు 37 రోజుల పాటు కొనసాగుతుందని వివరించారు. మొదటగా అన్ని కేటగిరీ పోస్టుల ఖాళీల వివరాలను జనవరి 27వ తేదీన నిర్మల్ జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్ www.deonml.weebly.com లో రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయ వెబ్‌సైట్ www. schooledu. telangana. gov. in లో అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, అన్ని కేటగిరీల స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతుల సీనియారిటీ జాబితాలు కూడా జనవరి 27 నుండి జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఉపాధ్యాయులు బదిలీల కోసం ఈనెల 28 నుంచి 30 వరకు మూడు రోజులపాటు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

నిర్మల్‌టౌన్: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నిర్మల్ క్లబ్ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా క్యారమ్, చెస్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించారు. క్లబ్ సభ్యులందరూ ఆయా పోటీల్లో పాల్గొన్నారు. గురువారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా ముగింపు కార్యక్రమం నిర్వహించారు. విజేతలకు మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, గేమ్స్ సెక్రటరీ రాజేశ్వర్, డైరెక్టర్లు సత్యనారాయణ, విశ్వస్‌రెడ్డి, పూదరి రాజన్న బహుమతులు ప్రదానం చేశారు.

కళతప్పిన గణతంత్రం



జెండా వందనం చేస్తున్న కలెక్టర్ ముషరఫ్



పూజా కార్యక్రమంలో కలెక్టర్, ఎస్పీ

- కలెక్టరేట్‌లో సాదాసీదాగా వేడుకలు
- శుభాకాంక్షలతో సరిపుచ్చిన కలెక్టర్
- వినిపించని ప్రసంగాలు.
- కనిపించని సాంస్కృతిక కార్యక్రమాలు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ ఆదేశాల మేరకు గణతంత్ర దినోత్సవ వేడుకలను జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఎలాంటి హంగు ఆర్భాటాలు లేకుండా నిర్వహించారు. 74వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని కలెక్టర్ ముషరఫ్ అలీ ఫారూఖీ స్వాతంత్య్ర సమరయోధుల చిత్రపటాల వద్ద పూజ చేశారు. తర్వాత జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఎస్పీ సీహెచ్.ప్రవీణ్‌కుమార్‌తో కలిసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా ప్రజలకు 74వ గణతంత్ర వేడుకల శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ రాంబాబు, హేమంత్ బోర్కడే, జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మితో కలిసి వివిధ శాఖల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు.

'కళ'తప్పిన వేడుకలు...

ఈసారి గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎలాంటి సందేశం ఇవ్వకుండానే వేడుకలను ముగించారు. వేడుకలను కూడా ఎన్టీఆర్ మినీ స్టేడియంలో కాకుండా కలెక్టరేట్‌కే పరిమితం చేశారు. శకటాల ప్రదర్శన, పోలీసుల పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించలేదు. ఇంత మొక్కుబడిగా వేడుకలు నిర్వహించడం గతంలో ఎన్నడూ చూడలేదని వేడుకలు చూసేందుకు వచ్చినవారు మాట్లాడుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, జెడ్పీ సీఈవో సుధీర్, డీఆర్డీవో విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, పరిశ్రమల శాఖ అధికారి నర్సింహారెడ్డి జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దేవేందర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జిల్లా న్యాయస్థానంలో..

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రధాన న్యాయస్థానంలో 74వ గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ అంబేద్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండా ఎగురవేశారు. స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, న్యాయవాదులు రమణారావు, నరేందర్ పాల్గొన్నారు.

ఎస్పీ క్యాంపు కార్యాలయంలో..

నిర్మల్‌టౌన్ : జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో 74వ గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్పీ ప్రవీణ్‌కుమార్ జాతీయ జెండా ఎగురవేశారు. జెండావందనం చేసి జాతీయ గీతం ఆలపించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ 1950, జనవరి 26న భారత రాజ్యాంగం అమలులోనికి వచ్చిందన్నారు. అప్పటి నుంచి భారత దేశం సర్వసత్తాక, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యాంగా ఏర్పడిందని తెలిపారు. పోలీసులు రాజ్యాంగ స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. అదనపు ఎస్పీ(ఏఆర్) వెంకటేశ్వర్లు, డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఏవో వెంకటశేఖర్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, సీఐలు శ్రీనివాస్, వెంకటేశ్, రాంనర్సింహారెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



జాతీయ నేతలకు నివాళులర్పిస్తున్న జడ్జి



జెండాకు సెల్యూట్ చేస్తున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్

బాసరలో జెండా ఆవిష్కరించిన మంత్రి



జెండా వందనం చేస్తున్న మంత్రి ఐకేరెడ్డి

భైంసా: వసంత పంచమి ఉత్సవాల్లో పాల్గొనేందుకు గురువారం బాసరకు వచ్చిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి గణతంత్ర వేడుకలు కూడా బాసరలోనే నిర్వహించారు. ఆలయ ఈవో కార్యాలయం ఆవరణలో జాతీయ జెండా ఎగురవేశారు. జాతీయగీతం ఆలపించారు. అందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఏఎస్పీ కిరణ్‌ఖారె బదిలీ

- భైంసాలో శాంతిభద్రతల పరిరక్షణలో తనదైన ముద్ర
- నూతన ఏఎస్పీగా పాటిల్ కాంతిలాల్ సుభాష్





కిరణ్‌ఖారె, పాటిల్ కాంతిలాల్ సుభాష్

భైంసాటౌన్: భైంసా ఏఎస్పీ కిరణ్‌ఖారె బదిలీ అయ్యారు. ఐపీఎస్‌ల బదిలీల్లో భాగంగా ఏఎస్పీ కిరణ్‌ఖారెను హైదరాబాద్ సౌత్ వెస్ట్‌జోన్ డిప్యూటీ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో భైంసా ఏఎస్పీగా పాటిల్ కాంతిలాల్ సుభాష్‌ను నియమించింది. 2020 బ్యాచ్‌కు చెందిన ఈయన గ్రేహౌండ్స్ ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. బదిలీ ఉత్తర్వులు అందగానే సుభాష్ బాధ్యతలు చేపట్టనున్నారు.

భైంసా తొలి ఏఎస్పీ...

భైంసా పట్టణంలో కొన్నేళ్లుగా చోటు చేసుకుంటున్న అల్లర్ల నేపథ్యంలో భైంసా సున్నిత ప్రాంతంగా మారింది. ఏటా ఏదైనా ఉత్సవాలు జరిగిన సందర్భాల్లో పోలీసుశాఖ భారీ బందోబస్తు నిర్వహిస్తోంది. గతంలో పలుమార్లు అల్లర్ల ఘటనలు జరిగినా, 2020లో జరిగిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. దీనికితోడు 2021 మార్చిలో మరోమారు ఘర్షణలు చోటుచేసుకున్నాయి. దీంతో ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. మరోమారు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భైంసాకు ఏఎస్పీ స్థాయి అధికారిని నియమించింది. ఇందులో భాగంగానే 2017 బ్యాచ్ ఐపీఎస్ అధికారి కిరణ్‌ఖారెను భైంసా తొలి ఏఎస్పీగా 2021, మార్చిలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి భైంసాలో శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా కృషి చేశారు. మత ఘర్షణలు పునరావృతం కాకుండా సాధారణ పరిస్థితులు నెలకొనేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లారు. నేరాలు జరిగిన వెంటనే స్పందిస్తూ నేరస్తుల గుర్తింపులో సత్వర ఫలితాలు రాబట్టారు. నిందితుల గుర్తింపు, కేసుల సత్వర పరిష్కారంలో కృషిచేసిన పోలీసు సిబ్బందికి నగదు ప్రోత్సాహకాలు అందజేస్తూ వెన్నుతట్టారు. తన పదవీకాలంలో భైంసాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చూడడంలో తనదైన ముద్ర వేశారు.

నూతన ఏఎస్పీపై ఆశలు...

డివిజన్ కేంద్రమైన భైంసాకు ముధోల్ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంత ప్రజలే కాకుండా మహారాష్ట్ర సరిహద్దు గ్రామీణప్రాంత ప్రజలు కూడా రాకపోకలు సాగిస్తుంటారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే భైంసా వ్యవసాయమార్కెట్ పరంగా రెండోస్థానంలో ఉండడంతోపాటు పత్తి జిన్నింగ్ మిల్లులు ఉండడంతో కరీంనగర్, వేములవాడ, తదితర ప్రాంతాల రైతులు పత్తి విక్రయించేందుకు భైంసా వస్తుంటారు. అలాగే భైంసాలో వ్యాపార లావాదేవీల నిమిత్తం సైతం హైదరాబాద్, నిజామాబాద్, తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు రాకపోకలు సాగిస్తుంటారు. భైంసాలో గతంలో తరచూ అల్లర్లు జరిగిన సందర్భాల్లో రోజుల తరబడి దుకాణాలు మూసిఉంచాల్సి వచ్చేది. దీంతో వ్యాపారాలు సక్రమంగా జరుగక నష్టపోయేవారు. భైంసాకు ఏఎస్పీ స్థాయి అధికారి రావడంతో భైంసా వాసుల్లో భరోసా ఏర్పడింది. అనుకున్నట్లుగానే ఏఎస్పీ కిరణ్‌ఖారె శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేశారు. ఇప్పుడు ఆయన బదిలీ కావడంతో, ఆయన స్థానంలో బాధ్యతలు చేపట్టనున్న పాటిల్ కాంతిలాల్ సుభాష్ శాంతిభద్రతల పరిరక్షణలో తనదైన ముద్ర వేయాలని కోరుతున్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు

భైంసాటౌన్: ఆర్టీసీ ఆధ్వర్యంలో భైంసా డిపోలో గురువారం గణతంత్ర వేడుకలు నిర్వహించారు. డీఎం అమృత జాతీయ పతాకం ఎగురవేశారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. తోటి ఉద్యోగులు వీరిని ఆదర్శంగా తీసుకుని సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.



ప్రశంసపత్రాలు అందిస్తున్న డీఎం అమృత

క్లుప్తంగా

మరణానంతరం సేవలకు గుర్తింపు



అవార్డు అందుకుంటున్న ఉబేద్

కైలాస్‌నగర్: ప్రభుత్వ ఉద్యోగులకు జీవించి ఉన్నప్పుడే పురస్కారాలు, ప్రశంసలు దక్కడం సహజం కానీ మరణానంతరం సైతం తన సేవలకు గుర్తింపునిచ్చి గౌరవించడమనేదీ అరుదు. గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన గణతంత్ర్య వేడుకల్లో ఇలాంటి ఘటనే చోటు చేసుకుంది. పంచాయతీరాజ్ ఆదిలాబాద్ డీఈగా పనిచేసిన సయ్యద్ రఫతుల్లా గతేడాది అక్టోబర్ 30న సీతాగొంది వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. డీఈగా ఆయన అందించిన సేవలకు ఆ శాఖ గుర్తింపునిస్తూ ప్రశంసపత్రానికి ఎంపిక చేసింది. కలెక్టరేట్‌లో జరిగిన వేడుకల్లో ఆయన కుమారుడు సయ్యద్ ఉబేద్‌కు కలెక్టర్ సిక్తా పట్నాయక్ చేతుల మీదుగా ప్రశంసపత్రాన్ని అందుకోవడం విశేషం.

హెచ్‌ఎం తీరుపై గ్రామస్తుల ఆగ్రహం

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఆలస్యంగా జాతీయజెండా ఆవిష్కరణకు కారణమైన హెచ్‌ఎంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 74వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా పాఠశాలలో జెండా ఎగురవేసే కార్యక్రమానికి గ్రామంలోని ప్రజాప్రతినిధులతోపాటు ఎవరికీ కూడా సమాచారం ఇవ్వలేదని సర్పంచ్ మహేందర్, ఉపసర్పంచ్ దొనికెని సాగర్, పలువురు గ్రామ పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు ప్రధానోపాధ్యాయుడు గురువారం ఆలస్యంగా రావడంతో ఉదయం 8.30 వరకు ఎగరాల్సిన జెండాను 9.20కి ఎగురవేశారని పేర్కొన్నారు. ఈ విషయమై సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామస్తులు హెచ్‌ఎంను ప్రశ్నించడంతో, జెండా ఆలస్యమైన విషయంపై తనపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన వారికి దావత్ ఇస్తానని అనడంతో తీవ్రంగా మండిపడుతున్నారు.

ట్రిపుల్ ఐటీలో గణతంత్ర వేడుకలు



జెండా ఎగురవేస్తున్న వీసీ వెంకటరమణ

భైంసా: బాసర ఆర్జీయూకేటీ(ట్రిపుల్‌ఐటీ)లో గురువారం గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ, డైరెక్టర్ సతీశ్‌కుమార్ జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం వర్సిటీ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. రూ.50 కోట్లతో ఇప్పటివరకు పలు పనులు చేపట్టినట్లు వెల్లడించారు. హెచ్‌ఎండీఏ, మున్సిపల్ శాఖ తరపున గ్రీన్ క్యాంపస్ కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. విజన్ 2025 లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్స్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్స్, అడ్మినిస్ట్రేటివ్ హెడ్స్, స్పోర్ట్ స్పెషల్ ఆఫీసర్, ప్రభాకర్‌రావు, పీడీ శ్యాంబాబు, రవికిరణ్, వసంత తదితరులు పాల్గొన్నారు.

నాగోబాకు పోటెత్తిన భక్తజనం



ఇంద్రవెల్లి: నాగోబా జాతరకు గురువారం భక్తులు పోటెత్తారు. సెలవు రోజు కావడంతో ఉమ్మడి జిల్లాతో పాటు తెలంగాణ, మహారాష్ట్రల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. గంటల తరబడి క్యూలో నిల్చొని నాగోబాను దర్శించుకున్నారు. నాగోబా జాతర పరిసర ప్రాంతాల భక్తులు ఎడ్ల బండ్లపై నాగోబా ఆలయానికి చేరుకున్నారు. నాగోబా ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు జాతరలో ఏర్పాటు చేసిన దుకాణ సముదాయల వద్ద ఇళ్లకు కావాల్సిన సామగ్రిని కొనుగోలు చేశారు. ఈ నెల 28 వరకు అధికారికంగా నాగోబా జాతర కొనసాగనుంది.



రంగులరాట్నాల వద్ద సందడి



జాతరలో ఇంటి సామగ్రిని కొనుగోలు చేస్తున్న భక్తులు



ఎడ్ల బండితో జాతరకు వస్తున్న భక్తులు

గిరిజనాభివృద్ధే ధ్యేయంగా ముందుకు



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి



ప్రశంస పత్రాలు అందిస్తున్న పీవో

ఉట్నూర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధీనంలోని గిరిజన ప్రాంతాల సంపూర్ణ అభివృద్ధికి ఐటీడీఏ ద్వారా కృషి చేస్తున్నామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వరుణ్‌రెడ్డి అన్నారు. 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురష్కరించుకుని గురువారం ఐటీడీఏ ప్రాంగణంలో జెండా ఎగురవేసి మాట్లాడారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యాభివృద్ధి లక్ష్యంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 917 గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో 12,945 మంది గిరిజన విద్యార్థులకు 681 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారని, అలాగే 133 గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 34,658 గిరిజన విద్యార్థులు పదో తరగతి వరకు చదువుకుంటున్నారని తెలిపారు. అలాగే ఐటీడీఏ పరిధిలోని 32 పీహెచ్‌సీలు, 186 ఉప ఆరోగ్యకేంద్రాలు, రెండు సామాజిక ఆరోగ్య కేంద్రాల ద్వారా గిరిజనులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు వివరించారు. వనబంధు కల్యాణ యోజనా ద్వారా ఏజెన్సీలోని కెరమెరి, వాంకిడి, తిర్యాణి మండలాల్లో వైద్య, వైద్య, వ్యవసాయం, విద్యుత్, మంచినీటి సరఫరా, ఇతర మౌలిక వసతులు కల్పన కోసం పది కోట్లు విడుదల కాగా ఇప్పటికి రూ. 7.50 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గిరిజన సహకార సంస్థ ద్వారా 17 పెట్రోల్ పంపులు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయగా ఆరు బంకులు ఏర్పాటు చేశామన్నారు. 97 మంది ఉత్తమ అధికారులకు, సిబ్బందికి ప్రశంస పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూఏసీ చైర్మన్ కనక లక్కెరావ్, ఐటీడీఏ ఏవో రాంబాబు, ఏపీవో జనరల్ కనక భీంరావ్, అర్డీవో సురేశ్, డీటీటీడబ్ల్యూ దిలీప్‌కుమార్, ఈఈటీడబ్ల్యూ భీంరావ్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, జీసీడీవో చాయా, ఆర్సీవో గంగాధర్, జేడీఎమ్ నాగాభుషణం, ఐసీడీఎస్ సీడీపీవో శ్రావణి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చేలా శ్రమించాలి



యాత్ర పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్:కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి వచ్చేలా ప్రతీ కార్యకర్త శ్రమించాలని ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో హాథ్ సే హాథ్ జోడో యాత్రను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా హాత్ సే హాత్ జోడో కార్యక్రమం ఉంటుందన్నారు. దేశ సమైక్యత, సమగ్రత కోసం రాహుల్ గాంధీ చేస్తున్న కృషిని ప్రతీ కార్యకర్త ప్రజలకు వివరించాలన్నారు. దేశ నిర్మాణంలో కాంగ్రెస్ పార్టీ చేసిన త్యాగాలను, చరిత్రను గుర్తు చేయాలని సూచించారు. రెండు నెలలు జరగనున్న ఈ కార్యక్రమంలో భారత్ జోడో యాత్రలో రాహుల్ సందేశం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ముత్యంరెడ్డి, జిల్లా, పట్టణ, మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

దేశ ప్రజలంతా ఆత్మగౌరవంతో, సమానత్వంతో, సమాన హక్కులతో సగర్వంగా జీవించేదుకు అవకాశం కల్పించిన ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగం మనదని మహేశ్వర్‌రెడ్డి అన్నారు. అంతటి మహోన్నతమైన రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని మహేశ్‌రెడ్డి నివాసంలో నిర్వహించిన 74వ గణతంత్ర వేడుకల్లో పాల్గొన్నారు. డీసీసీ అధ్యక్షుడు ముత్యంరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 74 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

వాహనం బోల్తా..

నేరడిగొండ: మండలంలోని రోల్‌మమడ జాతీయ రహదారిపై గురువారం ఉదయం తుఫాన్ వాహనం బోల్తాపడిన సంఘటనలో ఏడుగురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే...కేరళ రాష్ట్రం నుంచి తుఫాన్ వాహనంలో మధ్యప్రదేశ్‌కు చెందిన 20మంది కూలీలు వెళ్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని రోల్‌మమడ జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు డీవైడర్‌ను ఢీకొని వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఎన్‌హెచ్ఏఐ పెట్రోలింగ్ సిబ్బంది నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డెక్కిన రైలుబండి



జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై వెళ్తున్న ఎలక్ట్రికల్ రైలుబండి

నిర్మల్‌టౌన్: వేదం గ్లోబల్ స్కూల్ వారి ఎలక్ట్రికల్ రైలు జిల్లా కేంద్రంలో గురువారం రోడ్డెక్కి సందడి చేసింది. వసంత పంచమని పురస్కరించుకొని పాఠశాల ఆధ్వర్యంలో రోడ్డుపై రైలు నడుపుతూ విద్యార్థులు నూతన అడ్మిషన్ల కోసం కాన్వసింగ్ నిర్వహించారు. దీంతో పట్టణ ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

ఫుడ్‌సేఫ్టీ తనిఖీలు శూన్యం

- నాగోబా జాతరలో ఇష్టానుసారంగా హోటళ్ల నిర్వహణ
- జిల్లా అధికారుల ఆదేశాలు బేఖాతర్



ఇంద్రవెల్లి: నాగోబా జాతరలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేసి జాడలేకుండా పోయారు. దీంతో హోటల్ నిర్వహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులు జాతర ప్రారంభం నుంచి ముగింపు వరకు తనిఖీలు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. అయినా ఆ ఆదేశాలను ఫుడ్‌సేఫ్టీ అధికారులు బేఖాతర్ చేశారు. దీంతో హోటల్ వ్యాపారులు తినుబండారాల తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో, ఆహార పదార్థాలపై కనీసం దుమ్ముధూళి పడకుండా కవర్లు కూడా కప్పడం లేదు. దీంతో ఆ ఆహార పదార్థాలు తిని భక్తులు అనారోగ్యానికి గురై అవకాశాలు లేకపోలేదు.

హోమియోపతి పీజీ ఎంట్రెన్స్‌లో ప్రతిభ



కొత్తపల్లి సుజ్జన్

కుంటాల : జాతీయస్థాయి హోమియోపతి పీజీ ఎంట్రెన్స్‌లో కుంటాలకు చెందిన కొత్తపల్లి గంగామణి–బుచ్చన్న దంపతుల కుమారుడు కొత్తపల్లి సుజ్జన్ ప్రతిభ కనబర్చాడు. 2022, సెప్టెంబర్‌లో పరీక్ష నిర్వహించగా, ఫలితాలు ఇటీవల విడుదలయ్యాయి. ఇందులో సుజ్జన్ 52వ ర్యాంకు సాధించాడు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి కోల్‌కత్తాలో రిఫర్‌టీ విభాగంలో సీటు సాధించాడు.

ఖరీఫ్ బియ్యం అప్పజెప్పలే..!

- పూర్తికాని 2021–22 సీజన్ సీఎంఆర్
- అయినా మళ్లీ ధాన్యం కేటాయింపు

జిల్లావ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి. సేకరించిన ధాన్యం కస్టం మిల్లింగ్ కోసం మిల్లులకు కేటాయించారు. గత ఖరీఫ్ కేటాయించిన ధాన్యంలో 90 శాతం సీఎంఆర్ పూర్తిచేసిన వారికే ఈ ఖరీఫ్‌లో ధాన్యం కేటాయించాలని పౌరసరఫరాల శాఖ నిబంధనలు విధించింది. కానీ జిల్లా అధికారులు గత ఖరీఫ్ (2021–22) సీజన్‌కు సంబంధించి ఇప్పటికీ సీఎంఆర్ పూర్తి చేయని మిల్లులకు మళ్లీ ధాన్యం కేటాయించారు.

భైంసాటౌన్: జిల్లాలో సీఎంఆర్ ప్రక్రియ ప్రహసనంగా మారింది. గత ఖరీఫ్‌కు సంబంధించి ఇప్పటికీ కొందరు మిల్లర్లు బియ్యం ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో అప్పగించలేదు. అయినా, ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కూడా వారికి ధాన్యం కేటాయించారు. గత సీజన్‌కు సంబంధించి 90 శాతం సీఎంఆర్ పూర్తిచేసినవారికే ఈ సీజన్‌లో ధాన్యం కేటాయించామని సంబంధిత అధికారులు చెబుతున్నా, వాస్తవానికి జిల్లాలో కొందరు మిల్లర్లు లక్ష్యం చేరకపోయినా, ధాన్యం కేటాయించడంలో మర్మం సంబంధిత అధికారులకే తెలియాలి.

అప్పగించాల్సింది ఐదువేలకుపైగా...

ఖరీఫ్ 2021–22 సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 1,28,348 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 41 రైస్‌మిల్లులకు కస్టమ్ మిల్లింగ్ కోసం కేటాయించారు. కస్టం మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి 86,018.330 మెట్రిక్ టన్నుల బియ్యం అప్పగించాల్సి ఉండగా, 80,893.754 మెట్రిక్ టన్నులు అప్పగించారు. అంటే, దాదాపు 31 మంది మిల్లర్లు వందశాతం సీఎంఆర్ లక్ష్యం పూర్తిచేయగా, పదిమంది మిల్లర్లు ఇప్పటికీ పూర్తిస్థాయిలో బియ్యం అప్పగించలేదు. ఇంకా 5124.576 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది.

తగిన చర్యలు తీసుకుంటాం...

గత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 90 శాతం మిల్లింగ్ పూర్తి చేసినవారికి ఈ సీజన్‌లో ధాన్యం కేటాయించాం. గత సీజన్‌కు సంబంధించి లక్ష్యం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. లక్ష్యం చేరుకోనివారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– తనూజ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

ఉత్తమ సేవలకు 'ప్రశంస'



ప్రశంసాపత్రం అందుకుంటున్న జెడ్పీ సీఈవో సుధీర్ కుమార్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న అధికారులతోపాటు, సిబ్బంది ఉత్తమ సేవలకు 74వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం ప్రశంసాపత్రాలు అందించారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గణతంత్ర వేడుకల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 210 మందికి కలెక్టర్ ముషరఫ్ అలీ, ఎస్పీ ప్రవీణ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు.



విజయలక్ష్మి డీఆర్డీవో



అంజిప్రసాద్, డీఏవో



శివప్రసాద్, కలెక్టరేట్ ఏవో



రామ్‌చందర్, నాయబ్ తహసీల్దార్



రఘునాథ్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ | సంతోష్‌కుమార్, ఆర్టీపీసీఆర్ ల్యాబ్ టెక్నీషియన్ | ముచ్చిండ్ల రమేష్ ఎక్స్‌రే టెక్నీషియన్ | సోమయ్య ఫార్మసిస్ట్, జిల్లా ఆసుపత్రి | శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ మిషన్ భగీరథ



సురేష్, డీఎస్పీ ట్రిపుల్ ఐటీ | వెంకటేశ్, నిర్మల్ రూరల్ సీఐ | వెంకటరమణ, ఎస్సై(సీసీ) | రాజాగౌడ్, ఎస్పీ పీఆర్వో | దేవేందర్, ట్రాఫిక్ ఎస్సై



రోజా, స్టాఫ్‌నర్సు | నర్సింగ్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్, ఉపాధి హామీ | గంగాజల ఏఈవో, పెంబి | భాస్కర్, ట్రెజరీ ఆఫీస్ | రాంబాయమ్మ, హెడ్‌నర్స్



అనిల్, టిహబ్, ల్యాబ్ టెక్నీషియన్ | ఓటరికారి ప్రసన్న, డీఈవో సీసీ | రుక్మిణి, హెడ్‌నర్స్, ఖానాపూర్ | షాహిదా, స్టాఫ్‌నర్సు | సరస్వతి, స్టాఫ్‌నర్సు | కిషన్ శానిటరీజవాన్



విజయగౌరి, ఐసీడీఎస్, సూపర్‌వైజర్ | కాశీనాథ్, భైంసా ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ | ఫయాజ్, నిర్మల్ మున్సిపాలిటీ | పోచయ్య సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ | శెట్టిపల్లి వంశీ, ఇంజనీర్ కల్లూరు సబ్‌స్టేషన్ | శ్రీమతి సీడీపీవో భైంసా డివిజన్